క్లుప్తంగా

ప్రత్యేక పూజలు


మారెమ్మవ్వ

ఆస్పరి: స్థానిక మారెమ్మవ్వ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అర్చకులు గోవిందు ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరి


భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రంగస్వామి

మద్దికెర: విద్యార్థులకు అందించే భోజనంలో తప్పనిసరిగా మెనూ పాటించాలని.. లేకుంటే చర్యలు తప్పవని మండల విద్యాధికారి రంగస్వామి అన్నారు. మంగళవారం స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బియ్యం బాగాలేకపోతే వెంటనే అధికారులకు తెలియజేస్తే వెనక్కి పంపి మరో రకాన్ని అందించడం జరుగుతుందన్నారు. ఎంఈఓతో పాటు ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి ఉన్నారు.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం


పత్తికొండలో సన్మానం అందుకున్న పెన్షనర్లు

పత్తికొండ(తుగ్గలి): పెన్షనర్ల దినోత్సవాన్ని మంగళవారం పత్తికొండలో విశ్రాంత ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వాసవీ కళ్యాణ మండపంలో సంఘం అధ్యక్షుడు టీఎండీ హుసేన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు. 75 ఏళ్లు దాటిన పెన్షనర్లను శాలువ కప్పి పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ జానకిరామయ్య, పెన్షనర్ల సంఘం నాయకులు జయ రాములు, ప్రతాప్, జేఏసీ ఛైర్మన్ సాయిబాబా పాల్గొన్నారు.

సీపీఐ నాయకురాలు మృతి


నక్కి మద్దమ్మ(ఫైల్)

కృష్ణగిరి: మండల పరిధిలోని కటారుకొండ గ్రామానికి చెందిన సీపీఐ నాయకురాలు నక్కి మద్దమ్మ(70) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొంత కాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. ఈమె భర్త నక్కి మౌలాలి గ్రామంలో పెత్తందారి వ్యవస్థపై పోరాటం చేసి అసువులు బాశారు. భర్త ఆశయ సాధన కోసం ఆమె పార్టీలో చురుగ్గా పాల్గొన్నారని, ప్రజా సమస్యలపై పోరాటాలు చేశారని మండల సీపీఐ కార్యదర్శి ఖలీల్‌బాషా కొనియాడారు. పలువురు సంతాపం తెలిపారు.

వక్ఫ్‌బోర్డు చైర్మన్‌ను కలిసిన నాయకులు


వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌ను కలిసిన ఎల్లార్తి దర్గా మాజీ నిర్వాహకుడు మల్లికార్జున

హొళగుంద: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అబ్దుల్ అజీజ్‌ను మంగళవారం ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాల మాజీ నిర్వాహకుడు, గ్రామ పెద్ద మల్లికార్జున విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువ కప్పి సత్కరించారు. ఎల్లార్తి దర్గాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరినట్లు మల్లికార్జున తెలిపాడు. త్వరలో దర్గాలను దర్శించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటానని చైర్మన్ హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

బాధితులకు న్యాయం చేయాలని వినతి

పత్తికొండ(తుగ్గలి): మాదిగలకు ఇచ్చిన భూములను తిరిగి అప్పగించి న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టీఎం రమేష్ కోరారు. ఈ మేరకు మంగళవారం పత్తికొండ ఆర్డీఓ కార్యాలయం ఎదుట బాధితులతో కలిసి ఆందోళన చేశారు. కృష్ణగిరి మండలం మాదాపురం గ్రామంలో 43.23 ఎకరాలు అసైన్‌మెంట్ భూమి మాదిగలకు కేటాయించారన్నారు. అయితే రెవెన్యూ అధికారులు అక్రమంగా ఓ పారిశ్రామికవేత్త పేరున ఆ భూమిని రికార్డుల్లో నమోదు చేశారన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు విన్నవించామన్నారు. అయితే కలెక్టర్ సిఫార్సులను కృష్ణగిరి తహసీల్దార్ పాటించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు అసైన్‌మెంట్ కమిటీ ఇచ్చిన భూములను సర్వేచేసి బాధితులకు అప్పగించి న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఆర్డీఓ భరత్‌నాయక్‌కు వినతి పత్రం అందజేశారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యం

- ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- ఏ, బీ, సీ కేటగిరీగా విభజన
- చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ


పాఠాలు బోధిస్తున్న అధ్యాపకులు

మద్దికెర: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులు ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ఇంటర్ బోర్డు అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా ఈ నెల ఒకటి నుంచి సంకల్ప్–2025 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పాఠశాల సమయాన్ని పెంచి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ బ్రాంచీలు ఉన్నాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 71 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 45 మంది విద్యార్థులు ఉన్నారు. 100 శాతం ఫలితాలే సాధనగా ముందుకు సాగుతున్నారు.

ప్రత్యేక తరగతులు

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో గతంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 వరకు తరగతులు ఉండేవి. ఈ నెల 1వ తేదీ నుంచి ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు ఉంటాయి. అన్నీ సబ్జెక్టుల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులకు అధ్యాపకులు తర్ఫీదు ఇస్తున్నారు. చదువులో వెనుకబడిన వారు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

కేటగిరీగా విద్యార్థుల విభజన

క్వార్టర్లీ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను ఏ,బీ,సీ కేటగిరీలుగా విభజించారు. చదువులో వెనుకబడిన వారిని సీ కేటగిరీగా విభజించారు. వీరి కోసం ఇంటర్‌బోర్డు ప్రతి ప్రభుత్వ జూనియర్ కాలేజీకి అన్ని గ్రూపులకు సంబంధించిన క్వశ్చన్ బ్యాంక్‌ను సరఫరా చేసింది. వెనుకబడిన విద్యార్థులు కూడా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా తర్ఫీదు ఇచ్చేందుకు జూనియర్ లెక్చరర్లను కేర్ టేకర్లుగా నియమించారు. కేర్‌టేకర్లు వారికి కేటాయించిన విద్యార్థులను ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చదివించడం, రాయించడం చేస్తున్నారు. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నాం. కేర్ టేకర్‌లను నియమించి విద్యార్థులు ఏయే సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించి వారికి ప్రత్యేకంగా బోధన తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులపై వ్యక్తిగతంగా శ్రద్ధ తీసుకుని సబ్జెక్టుల్లో వారి సందేహాలను నివృత్తి చేస్తున్నాం.

–సవిత, ప్రిన్సిపాల్, ఆదర్శపాఠశాల, మద్దికెర

ప్రత్యేక తరగతులతో ఉపయోగం



కాలేజీలో నిర్వహించే ప్రత్యేక తరగతులు ఉపయోగకరంగా ఉన్నాయి. ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చదివించడంతో పాటు చూడకుండా రాయిస్తున్నారు. చదువులో వెనుకబడి ఉన్న వారిని గుర్తించి మరింత శ్రద్ధ తీసుకుంటున్నారు. దీని వల్ల మంచి మార్కులు సాధించేందుకు ఆస్కారం ఉంటుంది.

–పల్లవి, ఎంపీసీ, సెకెండ్ ఇయర్

అర్థమయ్యేలాగా బోధిస్తున్నారు



ప్రత్యేక తరగతుల్లో అధ్యాపకులు అర్థమయ్యేలా బోధిస్తున్నారు. సబ్జెక్టులతో పాటు రాయించడం, చదివించడం వంటివి చేయిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాతో పాటు ఉంటూ తరగతులు నిర్వహిస్తున్నారు. సందేహాలను నివృత్తి చేస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

–మౌనిక, ఎంపీసీ, సెకెండ్ ఇయర్

చాలా బాగుంది



మాకు పరీక్షలు దగ్గరయ్యే కొద్ది సమయం వృథా కాకుండా తరగతులు నిర్వహిస్తూ తీర్చిదిద్దుతున్నారు. దీంతో మాకు అర్థం కాని సబ్జెక్టులు కూడా నివృత్తి చేసకోవడానికి సమయం దొరుకుతోంది. మంచి మార్కులు సాధిస్తామన్న నమ్మకం కలుగుతోంది.

–వనజ, ఎంపీసీ, సెకెండ్ ఇయర్

పేదరిక నిర్మూలనే లక్ష్యం

మద్దికెర: పేదలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు సంక్షేమ పథకాలు అమలు చేసి పేదరిక నిర్మూలనకు కృషి చేయాలని ఎంపీడీఓ కొండయ్య, జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, సర్పంచ్‌లు సుహాసిని, కల్పన, మల్లికార్జున, విజయుడు, ఆంజనేయులు, రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నిట్రవట్టిలో సీజనల్ హాస్టల్ ప్రారంభం

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలో సీజనల్ హాస్టల్‌ను ఉషోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రెసిడెంట్ చిన్నహ్యాట నాగరాజు ఎంఈఓ ఈరన్న, జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం హాకీం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు వలసలు వెళితే వారి పిల్లలు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో సీజనల్ హాస్టల్స్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు ముక్కన్న తదితరులు ఉన్నారు.

ముగిసిన సుంకులమ్మ దేవర

కృష్ణగిరి: మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో రెండు రోజులుగా జరుగుతున్న సుంకులమ్మ ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ప్రతి ఇంటి నుంచి బోణాలు తీసుకొచ్చి సమర్పించారు. ఉత్సవాలతో గ్రామం బంధువులతో కళకళలాడింది. ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి


రెవెన్యూ సదస్సులో ఆర్డీఓ భరత్‌నాయక్


కురుకుందలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ గోవింద్ సింగ్

ఆలూరు రూరల్: భూ వివాదాల పరిష్కారానికి గ్రామ స్థాయిలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ గోవింద్ సింగ్ అన్నారు. మంగళవారం మండలంలోని కురుకుంద గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో వివిధ భూ సమస్యలపై 17 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. అర్జీలకు 45 రోజుల్లో పరిష్కారం చూపుతామన్నారు. గ్రామ సర్పంచ్ దేవి రెడ్డి, మండల సర్వేయర్ అరుణ జ్యోతి, జూనియర్ అసిస్టెంట్ మహేష్, వీఆర్వోలు రవి కుమార్, రామకృష్ణ, లోకవీర గ్రామస్తులు ఉన్నారు.

నిత్యావసర సరుకులు సక్రమంగా అందడం లేదు

కురుకుంద గ్రామ ప్రజలకు మూడు నెలలుగా నిత్యావసరాలు పంపిణీ సక్రమంగా అందించలేని, రేషన్ షాపు డీలర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ గ్రామస్తులు గోవర్ధన్, లక్ష్మన్న, తిరుమల, ఆనంద్, రవి,వెంకటేష్ తహసీల్దార్ గోవింద్ సింగ్‌కు వినతి పత్రం అందించారు.

ఆస్పరి: మండలంలోని జొహరాపురం గ్రామంలో మంగళవారం తహసీల్దార్ శివశంకర్ నాయక్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదుస్సు నిర్వహించారు. 9 మంది రైతులు భూ సమస్యలను పరిష్కరించాలని దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ, సచివాయలం సిబ్బంది, వీఆర్ఓ హరి పాల్గొన్నారు.

భూసమస్యలపై అర్జీల స్వీకరణ

పత్తికొండ(తుగ్గలి): భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు చక్కటి వేదిక అని ఆర్డీఓ భరత్ నాయక్ అన్నారు. మంగళవారం పత్తికొండ మండలం నలకదొడ్డిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ భూ సమస్యలపై 15 మంది రైతులు అర్జీలు అందజేశారు. విచారించి భూ యజమానుల వద్ద ఉన్న పత్రాల ఆధారంగా సమస్యలు పరిష్కరిస్తామని ఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, వీఆర్వో మల్లికార్జున, మాజీ సర్పంచ్ లోక్‌నాథ్ పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే సదస్సులు

మద్దికెర: భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని ప్రత్యేక అధికారి ఉమాదేవి, తహసీల్దార్ హుస్సేన్‌సాహెబ్ అన్నారు. మంగళవారం స్థానిక రెండో సచివాలయంలో మద్దికెర పడమర రెవెన్యూ గ్రామానికి సంబంధించి సదస్సు నిర్వహించారు. చాలా మంది రైతులకు చుక్కలు భూములు, దేవాలయ భూములుగా నమోదైనందున తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సంబంధిత రైతులు అధికారులకు అర్జీలు సమర్పించారు. వీఆర్వోలు పక్కీరప్ప, రంగస్వామి, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వందవాగిలిలో రెవెన్యూ సదస్సు

హొళగుంద: మండల పరిధిలోని వందవాగిలి గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆన్‌లైన్ అడంగళ్లలో విస్తీర్ణానికి సంబంధించి సమస్యలు, భూముల క్రయ విక్రయాల ఇబ్బందులు తదితర వాటి గురించి రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. డిప్యూటీ తహసీల్దారు నిజాముద్దీన్, ఎండోమెంట్ ఆఫీసర్ నరేంద్ర, వీఆర్ఓ దామోదర తదితరులు పాల్గొన్నారు.

హాలహర్వి: మండల పరిధిలోని చింతకుంట, శిరగాపురం గ్రామాలలో మంగళవారం తహసీల్దారు నజ్మా బాను ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు జరిగాయి. విస్తీర్ణానికి సంబంధించిన సమస్యలు, సర్వేలు, ఆన్‌లైన్ అడంగల్‌లో చేర్పులు మార్పులు తదితర వాటిని పరిష్కరించాలని రైతులు అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ మహేశ్, సర్వేయర్ మంజుభార్గవి, సర్పంచ్ సద్దాంహుసేన్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తాం

కృష్ణగిరి: మండల పరిధిలోని కటారుకొండ గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి నూకరాజు, తహసీల్దార్ చంద్రశేఖర్ మాట్లాడారు. భూ సమస్యలపై అర్జీలు అందజేస్తే 45 రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎండోమెంట్, ఫారెస్టు అధికారులు, వీఆర్వో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి మండలంలో..

వెల్దుర్తి(కృష్ణగిరి): భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ అన్నారు. మండల పరిధిలోని పుల్లగుమి గ్రామంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. భూ సమస్యలున్న రైతులు సదస్సులో అర్జీలు ఇస్తే పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మండల సర్వేయర్ హేమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నిక ఏకగ్రీవం

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) డిస్ట్రిబ్యూటరీలకు సంబంధించి హొళగుంద–1 డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నిక మంగళవారం ఏకగ్రీవమయ్యింది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో హాలహర్వి మండలం జె హొసళ్లి–1, బల్లూరు–2, హొళగుంద మండలంలోని హొళగుంద–3, హొళగుంద–4, గజ్జహళ్లి–5, ఆదోని మండలంలోని పెద్దహరివాణం–6, బసాపురం–7, రొడూరు–8 సాగు నీటి వినియోగదారుల సంఘాలకు చెందిన డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షుడిగా హొళగుంద–4 సాగు నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు మిక్కిలినేని వెంకట శివప్రసాద్‌ను ఎన్నుకున్నారు. జె హొసళ్లి–1 నీటి సంఘానికి చెందిన పూజారి మల్లన్న ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అదేవిధంగా సభ్యులుగా సిద్దిఖ్, వణికేరప్ప, ఉస్మాన్, ఎర్రిస్వామి, రామస్వామి, పంపన్నగౌడ్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికలధికారి టీబీపీ ఈఈ శైలేశ్వర్, సహ ఎన్నికల అధికారి హొళగుంద సెక్షన్ ఇరిగేషన్ ఆఫీసర్ ఈశ్వర్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరిగాయి.

ఆలూరు బ్రాంచ్ కెనాల్ ఛైర్మన్‌గా నగరడోణ కిష్టప్ప

చిప్పగిరి: గుంతకల్లులోని ఇరిగేషన్ కార్యాలయంలో ఆలూరు బ్రాంచ్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ ఎన్నిక జరిగింది. ఛైర్మన్‌గా నగరడోణ కిష్టప్ప, వైస్ ఛైర్మన్‌గా మీసాల రామాంజినేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కుళాయి కనెక్షన్ల క్రమబద్ధీకరణకు చర్యలు

హొళగుంద: గ్రామంలో అక్రమంగా ఉన్న కుళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ సెక్రటరి రాజశేఖర్ తెలిపారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చలవాది రంగమ్మ ఆధ్వర్యంలో వార్డు సభ్యులతో సాధారణ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో 1772 కుళాయి కనెక్షన్లు అధికారికంగా ఉన్నాయని, అనధికారికంగా 947 కనెక్షన్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. వాటిని సక్రమం చేయడానికి ప్రతి కనెక్షన్‌కు రూ.2 వేలు డిపాజిట్ చేయాలని నోటీసులు జారీ చేస్తున్నట్లు చెప్పారు. తద్వార వచ్చే ఆదాయంతో పాటు ఇతర నిధులను సమకూర్చుకుని ఇంకొకటి ఓవర్ హెడ్ నీటిట్యాంకు నిర్మాణానికి ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించారు.

అదేవిధంగా గ్రామంలోని ఆయా వీధుల్లో విద్యుత్ స్తంబాల ఏర్పాటు, డ్రైనేజీల నిర్మాణం తదితర వాటికి సంబంధించి తీర్మానాలు చేసినట్లు సెక్రటరి తెలిపారు.

కూటమి నేతల ఒత్తిళ్లు భరించలేక ..

- సివిల్ సప్లై గోడౌన్ ఇన్‌చార్జ్ బాధ్యతల నుంచి తప్పుకున్న ఆర్ఐ

ఆలూరు : ఆలూరు సివిల్ సప్లై స్టాక్‌పాయింట్ ఇన్‌చార్జ్ బాధ్యతల నుంచి ఆర్ఐ బసన్నగౌడు తప్పుకున్నారు. నెలరోజుల క్రితం ఆయనకు స్టాక్‌పాయింట్ గోడౌన్ ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు. అయితే కూటమి నేతలు నెలకు భారీ మొత్తంలో మామూళ్లు ఇవ్వాలని ఒత్తిళ్లు తీసుకురావడంతోనే ఆయన తప్పుకున్నట్లు తెలుస్తోంది. ఆయనకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో అన్నీ తాను వెంట ఉండి చూసుకుంటానని టీడీపీ నేత భరోసా ఇచ్చారు. అయినా కింది స్థాయి చోటా నాయకులు మా ఖర్చులకు ఎవరిస్తారంటూ ఆర్ఐపై ఒత్తిళ్లు పెట్టారు. ఎలాగైనా ఇన్‌చార్జ్‌గా కొనసాగాలని కొందరు నియోజకవర్గ స్థాయి నాయకులు కోరినా.. తాను చేయలేనంటూ నాలుగు రోజుల క్రితం స్టాక్‌పాయింట్ ఇన్‌చార్జ్ బాధ్యతల నుంచి తప్పించాలని జిల్లా అధికారులకు లిఖిత పూర్వకంగా విన్నవించుకున్నారు. ప్రస్తుతం సివిల్ సప్లై గోడౌన్ ఇన్‌చార్జ్‌గా రఘురామిరెడ్డిని నియమించినట్లు ఆలూరు రెవెన్యూ అధికారులు తెలిపారు.

దుకాణాల వేలం వాయిదా

ఆలూరు రూరల్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నిర్మించిన 18 దుకాణాలకు ఈ నెల20వ తేదీన నిర్వహించాల్సిన బహిరంగ వేలాలు వాయిదా వేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సూర్యనారాయణ మంగళవారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేలాలు వాయిదా వేస్తున్నట్లు చెప్పారు. తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు.

వీఆర్వో మృతికి నివాళి

తుగ్గలి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రామకొండ వీఆర్వో శ్రీనివాసులుకు రెవెన్యూ అధికారులు నివాళులర్పించారు. పగిడిరాయిలో మంగళవారం జరిగిన అంత్యక్రియల్లో డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మట్టి ఖర్చుల నిమిత్తం ఎంపీడీఓ కార్యాలయం తరుపున పంచాయతీ కార్యదర్శి రాజునాయక్ రూ.25వేలు అందజేయగా, రెవెన్యూ ఉద్యోగులు, వీఆర్వోల సంఘం తరుపున డీటీ రూ.50 వేలు మృతుని భార్యకు అందజేశారు.

రేపు పత్తి క్రయవిక్రయాలు జరగవు

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో గురువారం పత్తి క్రయవిక్రయాలు జరగవని యార్డ్ సెక్రెటరీ రామ్మోహన్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పత్తి వ్యాపారుల అసోసియేషన్ సమావేశం ఉన్నందువలన వ్యాపారస్తులు పత్తి టెండర్లలో పాల్గొనడం లేదన్నారు. కావున పత్తి దిగుబడులను రైతులు గురువారం యార్డుకు తీసుకురావద్దని సూచించారు.

పశువైద్యశాలలకు మందులు

సాక్షి ఎఫెక్ట్

తుగ్గలి: పశువైద్యశాలలకు మందు సరఫరా చేయడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈనెల 15న మందుల కొరతపై 'చికిత్స మాత్రమే చేయబడును' అనే శీర్షికతో సాక్షిలో వచ్చిన కథనానికి పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ జి.శ్రీనివాస్ స్పందించారు. డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పి.వెంకటరమణ ఇచ్చిన నివేదిక ప్రకారం పశువులు, జీవాలకు టీకాలు వేస్తున్నామని తెలిపారు. ఈ నెల 17, 18 తేదీల్లో డివిజన్‌లోని అన్ని గ్రామాల్లో పశువైద్యశాలలకు మందులు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి


పత్తికొండలో శిక్షణ ఇస్తున్న ట్రైనర్


మాట్లాడుతున్న పత్తికొండ డీపీఓ వీరభద్రప్ప

పత్తికొండ(తుగ్గలి): ప్రణాళికాబద్ధంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సువర్ణలత అన్నారు. సుస్థిర అభివృద్ధిపై మంగళవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఆదాయ వనరులపై దృష్టి సారించాలన్నారు. ఇంటి పన్నులు సక్రమంగా వసూలు చేయాలన్నారు. గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి, ప్రణాళికల రూపకల్పనపై శిక్షకులు రామకృష్ణ, పవన్ అవగాహన కల్పించారు. ఎంపీపీ నారాయణదాసు, ఈవోపీఆర్డీ నరసింహులు, సర్పంచ్‌లులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

సుస్థిర అభివృద్ధి సాధించే దిశగా గ్రామ పంచాయతీలు పనిచేయాలని ఈవోపీఆర్డీ శ్రీహరి, ఏఓ ఎస్‌ఎం బాషా అన్నారు. తుగ్గలి ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. సంక్షేమ పథకాలకు అర్హులైన వారిని గుర్తించి వారికి ప్రయోజనం చేకూర్చేలా గ్రామ పంచాయతీలు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై మాస్టర్ ట్రైనర్లు నరేష్, గోపాల్, బండయ్య, సుమిత్రమ్మ శిక్షణ ఇచ్చారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

ఆస్పరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సచివాలయం సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు అధికారులు జాతిపిత మహాత్మాగాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పత్తికొండ డీపీఓ వీరభద్రప్ప మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి, లక్ష్యాల సాధనపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ రఘురామిరెడ్డి, ఈఓఆర్డీ విజయభాను, ఏంఈఓ తిరుమలరావు, ఎస్ఐ నరసింహులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా ఎరువులు వాడితే నష్టమే


రైతులకు సూచనలు చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మి


పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న ఏఓ

వెల్దుర్తి(కృష్ణగిరి): సమగ్ర పోషక యాజమాన్యం ద్వారా అవసరం మేరకే ఎరువులు వాడాలని జిల్లా వ్యవసాయాధికారిణి పి. వరలక్ష్మి రైతులకు సూచించారు. మండల పరిధిలోని పుల్లగుమ్మి గ్రామంలో మంగళవారం ఏఓ అక్బర్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె కంది పంటను పరిశీలించి ఎంత దిగుబడి వస్తుందని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎకరాకు మూడు క్వింటాళ్లలోపే దిగుబడి వస్తుందని పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొందని రైతులు వివరించారు. అలాగే కంది నూర్పిళ్లు చేసిన రైతుల నుంచి మార్కెట్ ఆధారంగా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు చేస్తామన్నారు. రైతులు తమ వివరాలను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని తెలిపారు. అలాగే రబీలో సాగు చేసిన శనగ పంటలో తెగులు నివారణకు హెక్సాకొనజోల్ ఎకరానికి 400 ఎంఎల్ చొప్పున పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే శనగలో పచ్చ పురుగు నివారణకు నోవాల్యూరాన్ 200 ఎంఎల్ లేదా స్పైనోసాడ్ 70 ఎంఎల్ చొప్పున ఎకరానికి, అలాగే వేపనూనె లీటర్ నీటికి 5 ఎంఎల్ కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. రబీలో పంటలు సాగుచేసిన రైతులు రైతు సేవా కేంద్రాలను సంప్రదించి పంట నమోదు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ, పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ స్వాతి, సర్వేయర్ హేమంత్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

శనగసాగులో మెలకువలు పాటించాలి

హాలహర్వి: పప్పుశనగ సాగులో రైతులు మెలకువలు పాటించాలని ఏఓ శివశంకర్ సూచించారు. మంగళవారం విరుపాపురం, బిలేహాళ్‌లో పప్పుశనగ పొలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమన్ని నిర్వహించారు. రైతులకు పంట కోతలు, సాగుపై అవగాహన కల్పించారు. పంటకు వేపనూనే వాడడం వల్ల చీడ పురుగులు నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో వీఏఏలు వెంకటలక్ష్మి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ స్కీమ్ వర్కర్ల ఆందోళన విరమణ


ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్

హొళగుంద: ఎట్టకేలకు ఎల్లార్తి మంచినీటి పథకం వర్కర్లు.. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ హామీతో ఆందోళన విరమించారు. జీతాలకు అందక ఈనెల 11వ తేదీ నుంచి విధులు బహిష్కరించడంతో పలు గ్రామాల్లో నీటి సమస్య తలెత్తింది. సమస్యను పరిష్కరించేందుకు మంగళవారం సబ్ కలెక్టర్ స్వయంగా ఎల్లార్తి మంచినీటి పథకాన్ని సందర్శించారు. అంతకు ముందు సమ్మతగేరి, పెద్దహ్యాట, ఎల్లార్తి తదితర గ్రామాల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులు, గతంలో నీటి సరఫరా ఎలా జరిగేది, నీటి నాణ్యత అనేక విషయాల గురించి ఆరా తీశారు. అనంతరం వాటర్ స్కీం వద్ద తహసీల్దారు సతీష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ, డీఈఈ మల్లికార్జునయ్య, ఏఈ రామ్‌లీల, పంచాయతీ సెక్రటరీ రంగస్వామితో కలిసి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 15 రోజుల్లో జీతం బకాయిలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కార్మికులు తమ ఆందోళనను విరమించి విధుల్లోకి చేరారు. మధ్యాహ్నం నుంచి గ్రామాలకు నీటి సరఫరాను పునరుద్ధరించడంతో ప్రజలు, అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.